www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 17 నవంబర్ 2023



ఆర్‌బికె నిర్ధారించిన తేమశాతమే ఫైనల్

సివిల్ సప్లయిస్ కమిషనర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆర్‌బికె వద్ద నిర్ధారించిన తేమ శాతమే ఫైనల్ అని సివిల్ సప్లయిస్ కమిషనర్ సిహెచ్.అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక రైతుభరోసా కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ధాన్యం సేకరణలో సమస్యలపై రైతులతో ఆయన చర్చించారు. కొనుగోలు కేంద్రంలో తేమశాతం 16 ఉంటే, రైసుమిల్లు వద్ద 19 శాతం ఉందంటున్నారని పలువురు రైతులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుభరోసా కేంద్రాల వద్ద కొలిచిన తేమశాతమే ఫైనల్ అని, దీనిపై విచారణ చేయిస్తామని కమిషనర్ రైతులకు భరోసా ఇచ్చారు. రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని ఆయన వివరించారు. ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ డివైజ్ అమరిక, సాంకేతిక సమస్యల కారణంగా ట్రక్ షీట్ జనరేట్ కావడం లేదని రైతులు చెప్పారు. ఉంగుటూరు మండలంలో ప్రస్తుతానికి

కొల్లేరు.. కలవరం..!



ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు అవగాహనా సదస్సులు

ఐదో కాంటూరు నుంచి పది కిలోమీటర్ల వరకూ ఈ జోన్

కొల్లేరు అభయారణ్యం విస్తరణకు ప్రణాళికలు

ఈ ప్రతిపాదనతో మరో 50కుపైగా గ్రామాలు కొల్లేరు పరిధిలోకి

నిడమర్రు మండలంలోని అన్ని గ్రామాలూ సరస్సులోకే

ఎకోసెన్సిటివ్ జోన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కొల్లేరు, పరిసర గ్రామాల ప్రజలు

జోన్ ఏర్పాటైతే అనేక నిబంధనలు అమల్లోకి, అభివృద్ధికి శరాఘాతం

మూడో కాంటూరుకు కుదింపునకు తిలోదకాలిచ్చి.. ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో తీవ్ర కలవరపాటు నెలకొంది. కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామంటూ నిన్నటి వరకూ వాగ్దానాలిచ్చిన ప్రభుత్వాలు.. ఏకంగా ఐదో కాంటూరు నుంచి పది కిలోమీటర్ల పరిధి వరకూ ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు ప్రయత్నించడం అత్యంత దారుణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుపై ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ కొల్లేరు పరిసర గ్రామాల్లో నిర్వహించిన అవగాహనా సదస్సుల్లో అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటైతే మరో 50కిపైగా బెడ్ గ్రామాలు కొల్లేరు అభయారణ్య పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. అంతేకాకుండా జోన్ పరిధిలో అనేక రకాల ఆంక్షలు అమలు కానున్నాయి. రోడ్డు వేయాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. పరిశ్రమల ఏర్పాటు అనేది మచ్చుకు కూడా కన్పించదు. ఇప్పుడు సాగు చేస్తున్న భూములన్నీ కొల్లేరు పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. దీంతో కొల్లేరును ఆనుకుని ఉన్న బెడ్ గ్రామాల ప్రజలంతా తీవ్రంగా నష్టపోనున్నారు. ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడనుంది. ప్రజలకు నష్టం చేకూర్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. కొల్లేరుపై పాలకులు చెబుతున్నదేమిటీ, చేస్తున్నదేమిటీ అనే చర్చ జనాల్లో విస్తృతంగా సాగుతోంది. దాదాపు 77 వేల ఎకరాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. కొల్లేరులో దాదాపు 120 బెల్టు గ్రామాల పరిధిలో దాదాపు ఏడు లక్షల జనాభా వరకూ ఉన్నారు. వరిసాగుకు అనుకూలంగా లేకపోవడంతో గత ప్రభుత్వాలు ఒత్తిడి తెచ్చి చేపల చెరువులు తవ్వించిన పరిస్థితి ఉంది. సొసైటీలు ఏర్పాటు చేసి కొల్లేరు భూములను అక్కడి ప్రజలకు ఇచ్చి చేపల చెరువులు తవ్వించారు. 2006లో అప్పటి ప్రభుత్వం ఆపరేషన్ కొల్లేరు పేరుతో చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి మరీ ధ్వంసం చేసింది. దాదాపు పది వేల ఎకరాల్లో జిరాయితీ భూముల్లోని చెరువులను సైతం ధ్వంసం చేసి, చిల్లిగవ్వ పరిహారం కూడా ఇవ్వలేదు. దీంతో కొల్లేరు ప్రజలు ఉపాధి కోల్పోయి వలస పక్షుల్లా రోడ్డున పడ్డారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి ఇక్కడి ప్రజలకు న్యాయం చేయాలంటూ ప్రజలు కోరడంతో ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ హామీలిచ్చాయి. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది.

పత్తాలేని మూడో కాంటూరుకు కుదింపు హామీ

2014 ఎన్నికల సందర్భంగా భీమవరంలో జరిగిన సభలో ప్రస్తుత ప్రధాని మోడీ మాట్లాడుతూ కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, ఇక్కడి ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగినట్లుగానే రాష్ట్రంలోని టిడిపి, బిజెపి ఉమ్మడి ప్రభుత్వం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. ఈ తీర్మానానికి వైసిపి సైతం ఆమోదం తెలిపింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తే దాదాపు 35 వేల ఎకరాల్లో కొల్లేరు సరస్సు ఉంటుంది. దీంతో మరో 35 వేల ఎకరాలు కొల్లేరు నుంచి బయటపడుతుంది. దీంతో ఇక్కడి ప్రజలకు ఉపాధికి ఇబ్బంది లేకుండా ఉంటుందని అప్పట్లో లెక్కలు వేశారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తే దాదాపు 22 వేల ఎకరాలు రైతులకిచ్చే అవకాశం ఉందని టిడిపి ప్రభుత్వ హయాంలో అంచనా వేశారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో కొల్లేరును అభివృద్ధి చేస్తామని, పూర్వవైభవం తెస్తామంటూ వైసిపి సైతం హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా కొల్లేరు గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరును మరింత విస్తరించి అక్కడి ప్రజలకు నష్టం చేకూర్చేవిధంగా అడుగులు వేస్తున్న పరిస్థితి ఉంది. కొల్లేరును ఆనుకుని ఉన్న మండలాలు ఏలూరు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, దెందులూరు, పెదపాడు, కైకలూరు, మండవల్లి, ఆకివీడుల్లో ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు సంబంధించి అవగాహనా సదస్సులు నిర్వహించాలని అధికారులు అదేశాలు జారీచేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు మినహా ఏలూరు జిల్లాలోని అన్ని మండలాల్లో సదస్సులు గురువారంతో పూర్తయ్యాయి.

నిడమర్రు మండలం పూర్తిగా కొల్లేరులోకే..

ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటైతే నిడమర్రు మండలంలో ఉన్న బువ్వనపల్లి, అడవికొలను వంటి గ్రామాలతోపాటు మండలంలోని మొత్తం 24 గ్రామాలు కొల్లేరు అభయారణ్య పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉంగుటూరు మండలంలో తల్లాపురం, కైకరం గ్రామాలు, భీమడోలు మండలంలో మల్లవరం, చెట్టున్నపాడు, ఆగడాలలంక, గుండుగొలను, భీమడోలు, అంబరుపేట రెవెన్యూ గ్రామాలు, మండవల్లి మండలంలో ఏడు గ్రామాలు, పెదపాడు మండలంలో సత్యవోలు, వడ్డిగూడెం, పెదపాడు, కొణికి, వీరమ్మకుంట, ముప్పర్రు వంటి గ్రామాలు, కైకలూరు మండలంలో కొట్టాడ, పెంచులమర్రు, ఆలపాడు, సోమేశ్వరం, భుజబులపట్నం, దొడ్డిపట్ల, రామవరం, ఆటపాక గ్రామాలు, దెందులూరు మండలంలో పోతునూరు, దోసపాడు, కొవ్వలి వంటి గ్రామాలు ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటైతే ఇక ఆయా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోనుంది. రోడ్లు, పరిశ్రమలు ఏర్పాటు వంటి ఏఒక్కటీ చేసే అవకాశం ఉండదు. ఎకోసెన్సిటివ్ జోన్‌ను వైసిపి ప్రజాప్రతినిధులే తీవ్రంగా వ్యతిరేకించారు. ఎకోసెన్సిటివ్ ఏర్పాటు ప్రతిపాదనలపై జనాల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయి. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

నేడు నూజివీడులో సిఎం పర్యటన సాగేదిలా

ప్రజాశక్తి - ఏలూరు


ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో పర్యటించనున్నారు. ఉదయం 9.55 గంటలకు తాడేపల్లిలోని హెలిప్యాడ్ నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.25 గంటలకు నూజివీడులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకుంటారు. అక్కడే 10.35 గంటల వరకు పలువురు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం ఉదయం 10.55 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. అనంతరం ఫ్రీ హోల్డింగ్ ఆఫ్ అసైన్‌మెంట్ ల్యాండ్ పట్టాలను, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి లబ్దిదారులకు అందజేసే సభా కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.35 గంటలకు సభా ప్రాంగణం నుండి బయలుదేరి 12.50 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.50 నుండి మధ్యాహ్నం 1.50 గంటల వరకు స్థానిక నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1.55 గంటలకు నూజివీడు హెలీపాడ్ నుండి తాడేపల్లి బయల్దేరి వెళ్తారు.

ఓటర్ల జాబితా అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజున పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఇపి, లింగ నిష్పత్తి, ఓటర్ల నమోదు, అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈరోల్‌పై రిపోర్టులు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిఎస్ఇలు, డిఎస్ఇలు తదితర అంశాలపై కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ నియోజకవర్గాల ఇఆర్‌ఒలతో సమావేశమై క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌పై సమీక్షించారు. డిసెంబర్ 25వ తేదీ నాటికి ఓటర్ల జాబితా సవరణను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, డిప్యూటీ ట్రెయినీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జెసి, అధికారులు

ఉండి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్చాలని జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి జివికె.మల్లికార్జునరావు అన్నారు. గురువారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు లిస్టుపై నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాల తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు భవితశ్రీ ఎంపిక

ప్రజాశక్తి - తణుకురూరల్

విశాఖపట్టణంలో ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ బాడ్మింటన్ అండర్-17 రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని చల్లా భవితశ్రీ (ఎంపిసి) అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. బాలికల టీమ్ ఛాంపియన్‌షిప్ సెలక్షన్స్‌లోనూ, వ్యక్తిగత సింగిల్స్ విభాగంలోనూ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాలు కైవసం చేసుకుని జాతీయ స్కూల్ గేమ్స్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గెలుపొందడం ఆనందంగా ఉందని, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కళాశాలలో అన్ని క్రీడా సౌకర్యాలూ వినియోగించుకుని జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించాలని తెలిపారు.



భవితశ్రీని అభినందిస్తున్న ఎస్‌కెఎస్‌డి కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి

మహేంద్ర మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

కెవిపిఎస్ జిల్లా కమిటీ

ప్రజాశక్తి - భీమవరం

కొవ్వూరు నియోజకవర్గం దొమ్మేరు గ్రామానికి చెందిన దళిత యువకుడు బొంతా మహేంద్ర గ్రామ వైసిపి గ్రూపు విభేదాల నేపథ్యంలో మృతి చెందిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో దొమ్మేరు గ్రామంలో దళిత యువకుడు బొంతా మహేంద్ర ఆత్మహత్య వైసిపి చేసిన హత్యే అన్నారు. వైసిపి గ్రూపు తగాదాలకు దళిత యువకుడిని బలిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా రోజు పాటు పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం ఏంటని ప్రశ్నించారు. పోలీసుల తీరు వైసిపి కార్యకర్తల్లా ఉందన్నారు. పోలీసులు రోజంతా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడంతో భయంతో మనస్తాపం చెందిన మహేంద్ర ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అరెస్టు అయిన మహేంద్రను విడుదల చేయించాలని కుటుంబ సభ్యులు హోంమంత్రికి తెలిపినా కనీసం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఘటనకు రాష్ట్ర హోంమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఒక దళిత యువకుడి మృతి ఘటనకు వైసిపి, పోలీసులు కారణమైతే కెవిపిఎస్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబును అక్రమంగా ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. గ్రూపు పోరులో దళిత యువకుడు బలికావడం బాధాకరమని తెలిపారు. మొత్తం జరిగిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసి మహేంద్ర ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చిన్న ఫ్లెక్సీ వివాదాన్ని ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో దళిత యువకుడిని అక్రమంగా పోలీస్ స్టేషన్లో నిర్బంధించి మృతికి కారణమైన పోలీసులపై, వారికి అండగా నిలిచిన వైసిపి గ్రూపుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. మహేంద్ర కుటుంబానికి న్యాయం చేయకపోతే కెవిపిఎస్ ఆధ్వర్యంలో అన్ని దళిత, ప్రజా సంఘాలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



శంకరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

మన దేశం మణిపూస శంకరయ్య

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

మన దేశం మణిపూస సిపిఎం సీనియర్ నేత ఎన్.శంకరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కొనియాడారు. స్థానిక మెంటేవారితోట సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు, సిపిఎం తమిళనాడు రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎన్.శంకరయ్యకు నివాళి కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, కేతా గోపాలన్ కార్యక్రమంలో పాల్గొని శంకరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ శంకరయ్య భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు అగ్రనాయకుల్లో ఒకరని, తమిళనాడులో సిపిఐఎం పార్టీ వ్యవస్థాపకులని తెలిపారు. ఆయన మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయనకు విప్లవ జోహార్లు తెలియజేస్తున్నామన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని సంవత్సరాల తరబడి ఆయన జైలు జీవితం గడిపారన్నారు. రైతాంగ ఉద్యమంలో, కార్మికోద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆయన నిరాడంబర జీవితం గడిపారన్నారు. తమిళనాడు శాసన సభకు రెండు సార్లు ఎన్నికయ్యారన్నారు. ఆయన సేవలను గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం డాక్టరేట్ ప్రకటిస్తే కేంద్రానికి తొత్తులుగా ఉన్న గవర్నర్ దాన్ని ఆమోదించలేదన్నారు. తమిళనాడు రాష్ట్రం ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తోందంటే ఆయన గొప్పతనాన్ని, ఆయన అందించిన సేవలు ఎనలేనవని అన్నారు.

మొదటికొచ్చిన చెత్త సమస్య

10 గ్రామాల ప్రజలు ఆందోళన

సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులో చెత్త సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొల్లేరు దిగువనున్న 10 గ్రామాల ప్రజలు, సిపిఎం నాయకులు శ్రేణులు గురువారం మరోసారి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డంపింగ్ వద్ద శిబిరం ఏర్పాటు చేసుకుని చెత్త వేయకుండా వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, సిపిఎం నేతలు మాట్లాడారు. నగర పంచాయతీ రెండు చోట్ల చెత్త డంపింగ్ చేస్తోందని తెలిపారు. గుమ్ములూరు రోడ్డులోని తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో చంద్రబాబు నాయుడు నగర్ కాలనీ పక్కన డంపింగ్ కేంద్రం ఉండగా, సిద్ధాపురం రోడ్డులో చినకాపవరం డ్రెయిన్ ఆనుకుని మరో డంపింగ్ కేంద్రం ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే సిద్ధాపురం వద్ద వేస్తున్న చెత్త రోడ్డుకు అడ్డంగా వచ్చేయడంతో వెళ్లే దారిలేక గతంలో గతంలో రెండుసార్లు ఆందోళన చేసినట్లు తెలిపారు. ధర్మాపురం, సిద్ధాపురం, చిన్నమిల్లిపాడు, కాలింగ్ గూడెం, రాజుపేట, కోళ్లపర్రు, కొల్లేరు తదితర గ్రామాలకు ఇది మార్గం కావడంతో దిగు కొల్లేటి చేపల చెరువులకు వెళ్లేందుకు ఎరువుల లారీలు ఎగుమతి, దిగుమతులకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. రోడ్డుపై చెత్త ఉండడంతో వెళ్లేదారి లేదన్నారు. అప్పుడు ఆందోళన చేయడంతో అధికారులు చెత్త డంపింగ్ నిలుపుదల చేసి తహశీల్దార్ కార్యాలయం వెనుక వేశారని తెలిపారు. అయితే అక్కడ స్థలం చాలకపోవడంతో మరలా ఇక్కడ వేస్తున్నారని తెలిపారు. దీంతో నిరసన తెలిపామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సంఘటనా స్థలానికి తహశీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ కృష్ణమోహన్ చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. వారు వినకపోవడంతో ఫైర్ ఇంజిన్ తెప్పించి చెత్తకు అంటించిన నిప్పును ఆర్పారు. అనంతరం గ్రామస్తులు రాస్తారోకో విరమించారు. సిద్ధాపురం గ్రామ సర్పంచి చిట్టిబాబు, ఉపసర్పంచి ఐ.నారాయణరాజు, గ్రామస్తులు సత్యనారాయణరాజు, సూరపరాజు, కృష్ణ, బాబు, సిపిఎం నాయకులు కె.తవిటినాయుడు, బివి.వర్మ, సందక సూరిబాబు, గేదెల ధనుష్, ప్రసాద్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, సిపిఎం నేతలు

పంచారామాలకు ప్రత్యేక బస్సులు : డిపో మేనేజర్

ప్రజాశక్తి - తణుకు

తణుకు ఆర్‌టిసి బస్సు డిపో నుంచి పంచారామాలకు స్పెషల్ బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్ తెలిపారు. ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీల్లో బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్లె వెలుగు టికెట్ ధర రూ.700, అల్ట్రా పల్లె వెలుగు రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్స్ రూ.వెయ్యి, సూపర్ లగ్జరీ రూ.1,100 అని తెలిపారు. ప్రతి పౌర్ణమికీ గిరి ప్రదక్షిణ చేసుకునే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అరుణాచలం అయ్యప్ప మాలదారుల సౌకర్యార్థం శబరిమలకు స్పెషల్ బస్సులు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని మాలదారులు, ప్రయాణికులు ఉపయో గించుకోవాలని కోరారు. అనంతరం పంచారామాల స్పెషల్ పోస్టులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పున్నయ్య, బివికె.రావు, గ్యారేజ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కలెక్టరమ్మా.. మీరైనా సమస్యలు పరిష్కరించండి..!

వీరవాసరంలో నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజావాణి, మీ కోసం, స్పందన, జగనన్న మీకోసం ఇప్పుడు జగనన్నకు చెబుదాం ఇవి ప్రజా సమస్యలు పరిష్కరించడానికి గత టిడిపి నుంచి నేటి వైసిపి వరకూ ఆయా ప్రభుత్వాలు నిర్వహించిన కార్యక్రమాలు. పేర్లు మార్చినంత మాత్రాన సమస్యలు పరిష్కారమవుతాయనుకుంటే పొరపాటే. గతంలో జిల్లా కేంద్రాల్లో మాత్రమే అమలు చేసే ఈ కార్యక్రమం తరువాత మండల కేంద్రాల్లో అమలు చేస్తున్నారు. తాజాగా ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించి సమస్యల పరిష్కారం చూపి ఈ కార్యక్రమం పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్నారు. అయితే స్థానిక అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలే గాని ఈ కార్యక్రమాన్ని ఎక్కడ నుంచి నిర్వహించినా ఒకటేనని పలువురు వాఖ్యానిస్తున్నారు. ఇదిలాఉంటే వీరవాసరంలో పలు సమస్యలు పరిష్కరించాలని కొన్ని సంవత్సరాలుగా ఫిర్యాదులు చేస్తున్నా వాటికి పరిష్కారం దొరకలేదు. అయితే ఈనెల 17వ తేదీన కలెక్టరే స్వయంగా మండలానికి వచ్చి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సారైనా ఆయా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది. వీరవాసరం జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. గతంలో తొలగించినా మరలా యథాస్థితిలోనే కొనసాగుతున్నాయి. ఒక దళారీ వ్యవస్థ ఆక్రమణలదారుల నుంచి డబ్బులు వసూలు చేసి అధికారులను లోబర్చుకోవడంతో ఆ సమస్య మరుగున పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీరవాసరం సఖినేటి పల్లి వారి వీధిలో అస్తవ్యవస్త అభివృద్ధి వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయని ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోని పరిస్థితి. వీరవాసరం ఒకటో వార్డులో పాఠశాలకు ఇబ్బందికరంగా ఉన్న ఆక్రణమణలు తొలగించాలని స్వయంగా కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం. వారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ వారికి కేటాయించిన స్థలంలో ఇంటిని నిర్మించుకునే విధంగా వారిని ప్రోత్సహించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారే విమర్శలు వినిపిస్తున్నారు. అలాగే వీరవాసరం - పెనుమంట్ర ఆర్అండ్‌బి రహదారిని ఆక్రమించుకుని షాపులు నిర్మించుకున్నా, వాటివల్ల మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉందని ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించడంలో నాన్చుడి ధోరణికి అలవాటు పడ్డారన్న ఆరోపణలున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫిర్యాదుదారుడి లోపాలను అవకాశంగా తీసుకుని అధికారులు వారిని ఎదురు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదుదారులు అంటున్నారు. ఇప్పటికైనా సమస్యల పట్ల స్థానిక అధికారులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా చిత్తశుద్ధితో ముందుకెళ్తే ఏ జిల్లా స్థాయి అధికారీ మండల స్థాయిలో పర్యవేక్షించాల్సిన అవసరం ఉండదని ఫిర్యాదుదారులు అంటున్నారు.




పోస్టర్ ఆవిష్కరణలో అంబికా కృష్ణ

చిన్న సినిమాలు రావాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చిన్న సినిమాలు రావాలని, వాటిపైనే ఆధారపడి సినీ కార్మికులు ఎంతోమంది బతుకుతున్నారని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, ఏలూరు మాజీ ఎంఎల్ఎ అంబికా కృష్ణ అన్నారు. ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత లయన్ కృష్ణంరాజు నిర్మాణ సారధ్యంలో ఆదిత్య క్రియేషన్స్ బ్యానర్‌పై డాక్టర్ వేల్పుల నాగేశ్వరరావు దర్శకత్వంలో నిర్మించిన శ్రీవీరప్రతాప..1940 సినిమా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదిత్య స్కూలులో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబికా కృష్ణ హాజరై మాట్లాడారు.

కాశిపాడు ఉపసర్పంచిగా నాగరాజు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశిపాడు ఉప సర్పంచిగా ఏడో వార్డు సభ్యులు తెర్లి నాగరాజు స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎం.వెంకటేష్ తెలిపారు. ప్రస్తుతం ఉప సర్పంచిగా ఉన్న గాదిరాజు బాలాజీరాజు రెండున్నరేళ్ల పదవీ కాల పరిమితి పూర్తి కావడంతో ఆయన రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగినట్లు చెప్పారు.


నియామకపత్రం అందుకుంటున్న నాగరాజు

20న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంగన్‌వాడీ సమస్యలపై ఈ నెల 17వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద, 18వ తేదీన ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిర్వహించే రిలే నిరాహార దీక్షలు అనివార్య కారణాల వల్ల ఈ నెల 20వ తేదీన ప్రాజెక్ట్ కార్యాలయం వద్దకు మార్పు చేసినట్లు అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి కానూరి తులసి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల20వ తేదీన పెనుమంట్ర ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆచంట సెక్టార్ లీడర్స్ మహాలక్ష్మి, రాణి ఆధ్వర్యంలో పెనుగొండ సెక్టార్ లీడర్స్ ఉషశ్రీ, పి.దుర్గాపరమేశ్వరి ఆధ్వర్యంలో, పెనుమంట్రలో సెక్టార్ లెటర్స్ వి.సరస్వతి, మౌనిక, సాయి మహాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగే రిలే నిరాహారదీక్షలో పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పత్రికా స్వేచ్ఛను ప్రజలే కాపాడుకోవాలి

ప్రజాశక్తి - వీరవాసరం

పత్రికా స్వేచ్ఛకు ముప్పు రాకుండా ప్రజలే దానిని కాపాడుకోవాలని సీనియర్ జర్నలిస్టు గుండా రామకృష్ణ అన్నారు. జాతీయ ప్రతికా దినోత్సవాన్ని వీరవాసరం వనితా క్లబ్ ప్రెసెడెంట్ డాక్టర్ బి.లక్ష్మీకళాయణి అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వనిత క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు సీనియర్ జర్నలిస్టు గుండా రామకృష్ణ, మల్లుల జైకృష్ణ, కుంచే శ్రీరంగ నాయకులు, నారగన సుధాకర్, ఆర్.లాల్‌రావు, చామకూరి నరసింహరావులను ఘనంగా సత్కరించారు.

తాడేపల్లిగూడెం : సమాజానికి పాత్రికేయులు చేస్తున్న సేవలు కీలకమని, వారిని గౌరవించాల్సిన బాధ్యత పౌరసమాజంపై ఉందని లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొండయ్యచెరువు సమీపంలోని కైండ్‌నెస్ సొసైటీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాడేపల్లిగూడెం సిటీ కేబుల్ టిసిసి వీడియో జర్నలిస్టులు శీలి రాజు, కాసాని వెంకటరత్నం, మణికంఠలను లయన్స్ క్లబ్ తరపున గవర్నర్ సత్కరించారు.

పెనుమంట్ర : పెనుమంట్ర ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను మార్టేరు ఎంపిటిసి సభ్యులు-1 జోగి అనురాధ, వార్డు సభ్యులు జోగి రెడ్డి సత్కరించారు.

పాలకొల్లు : పాలకొల్లు యునైటెడ్ కాపు క్లబ్ సారధ్యంలో సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. దీప్తి స్కూల్ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు పిటి.వెంకటేశ్వరరావు, ముత్యాల శ్రీనివాస్, విన్నకోట వెంకటరమణ, ఎంఎస్‌వి.సాంబశివరావు, కాపిశెట్టి గోపాలరావు, సంకు సుబ్రహ్మణ్యం, పోకల రాములను ఘనంగా సత్కరించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి బెల్లంకొండవారి మేరకలో స్త్రీ నిధి నిధుల దుర్వినియోగంపై వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులు విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన విఒఎ స్వయం సహాయక సంఘ సభ్యుల నుంచి స్త్రీ నిధి రుణాలు వసూలు చేసి తిరిగి బ్యాంకుకు చెల్లించకుండా దుర్వినియోగం చేశారు. ఈ సంఘటనపై గతంలోనే ఆమెపై మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సిసి జి యేసురత్నంను సస్పెండ్ చేశారు. దీనిపై పున:విచారణ చేశారు. ఈ విచారణలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్, ఎసి ఆచార్యులు, శ్రీరామ్, ఎపిఎం సుభాషిణి, మండల సమైక్య అధ్యక్షురాలు కడలి గంగాభవాని ఉన్నారు.

ప్రజా సంక్షేమమే జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యమని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి సచివాలయం-2లో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ రచ్చబండ పేరుతో స్థానిక ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ఉండి : ఉండి సచివాలయం-2 పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన జెండా స్థూపాన్ని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు రణస్థుల కనకదుర్గ మహంకాళి, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉండి ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, పార్టీ గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున్ పాల్గొన్నారు.

పాలకోడేరు : మండలంలోని కొండేపూడిలో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించినట్లు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) తెలిపారు. కొండేపూడిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రదర్శించిన బోర్డును ఎంపిపి చంటిరాజు ఆవిష్కరించారు. అనంతరం వైసిపి పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కొండేపూడి; వేంద్ర, అగ్రహారాల సర్పంచులు చింతపల్లి వెంకటనారాయణ (చిన్న), కడలి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు.

నేత్రాల పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - గణపవరం

వారానికి ఒకసారి ఆకుపచ్చని కూరలు ఆహారంలో తీసుకోవడం వల్ల కంటికి మంచిదని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 41 మంది విద్యార్థులకు గురువారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రాల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం బాల భాస్కరరావు, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పి నున్న పాప, ఎఎన్‌ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్లు గేదెల శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎం.నల్లయ్య పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

పాలకోడేరు : క్రైస్తవ సోదరుడు సాటి మనుషుల పట్ల సేవా భావాన్ని కలిగి ఉండాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సిసి) రాష్ట్ర అధ్యక్షులు మేడిది జాన్సన్ అన్నారు. వేంద్ర సుబ్బారాజపురంలో ఎ.శ్యాంబాబు చర్చిలో గురువారం నిర్వహించిన జిల్లా సమావేశానికి జాన్సన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నారు. ఏడు నియోజకవర్గాలకు అధ్యక్షులను ఎన్నుకున్నారు.

స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు

మెప్మా సిటీ మిషన్ మేనేజర్ చిట్టూరి నానిబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరులో లక్ష్యానికి మించి అందిస్తున్నామని భీమవరం మెప్మా సిటీ మిషన్ మేనేజర్ చిట్టూరి నానిబాబు తెలిపారు. భీమవరం మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. భీమవరం అర్బన్ పరిధిలో మొత్తం 2150 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉన్నాయన్నారు. ఈ సంఘాల పనితీరు బట్టి రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. 2022-23 ఏడాదికి సంబంధించి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రూ.25 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్దేశించగా రూ.42.96 కోట్ల రుణాలను 434 స్వయం సహాయ సంఘాలకు అందించామన్నారు. 2023-24 ఏడాదికి సంబంధించి రూ.20 కోట్ల రుణాలు లక్ష్యం కాగా ఇప్పటికే లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. ఈ ఏడాదికి సంబంధించి 385 సంఘాలకు రూ.20 కోట్ల రుణాలను అందించామన్నారు. ఈ ఏడాది ఐదు నెలలు మిగిలి ఉండటంతో లక్ష్యానికి మించి రుణాలు అందించనున్నామని తెలిపారు.


నానిబాబు

ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పిస్తున్నాం

స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయడమే కాకుండా సంఘాల్లోని మహిళలు ఉత్పత్తి చేసే ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పిస్తున్నామన్నారు. వారు తయారు చేసే వస్తువులను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థల్లో విక్రయిస్తున్నామన్నారు. టిడ్కో లబ్ధిదారులకు బి, సి కేటగిరీలుగా విభజించి బి కేటగిరిలోనివారికి రూ.3.15 లక్షల చొప్పున రుణాన్ని 3500 మందికి అందించామన్నారు. సి కేటగిరిలోని లబ్ధిదారులకు రూ.3.65 లక్షల చొప్పున 148 మందికి రుణాలను అందించామన్నారు. భీమవరంలో ప్రతినెలా మొదటి వారంలో అర్బన్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్బన్ మార్కెట్ నిర్వహించే రోజున మహిళలు తయారుచేసే వస్తువులను విక్రయించడం, వాటి కొనుగోలు సంబంధించిన ప్రచారాన్ని కల్పించడం చేస్తున్నామన్నారు. కళ్యాణమస్తు పథకంలో సుమారు 200 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఇప్పటికే ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3లలో లబ్ధిదారులకు నగదును అందించామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మండల పరిషత్ సమావేశంలో ఎంఎల్‌సి రవీంద్రనాథ్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి సర్వసభ్య సమావేశంలో మినిట్స్ బుక్‌లో సమస్యలు రాసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతాయని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి) అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు బ్యాంకు నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు లోన్ సదుపాయం పొందేవిధంగా సాయం అందిస్తామన్నారు. పెనుమంట్ర నుంచి జుత్తిగ హైస్కూల్ రోడ్డు అధ్వానంగా ఉందని జుత్తిగ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎఇ యశ్వంత్ తెలిపారు. అనంతరం ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్‌కు ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి, సభ్యులు, అధికారులు సన్మానం చేశారు. గత పదేళ్లుగా ఎన్ఆర్ఇజిఎస్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న వరలక్ష్మి ఇరగవరం బదిలీ కావడంతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఏలియమ్మ, వైస్ ఎంపిపి-2 అనిత, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానం పొందుతున్న ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు


నరసాపురంలో...

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల యుజి గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాలు వాటి ప్రయోజనాలు అంశంపై గురువారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నరసాపురంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 30 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు పర్యవేక్షించి గెలిచిన వారికి ముగింపు ఉత్సవాల్లో బహుమతులను అందిస్తామని చెప్పారు. గ్రంథాలయ అధికారి జి.కోటయ్య కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, భూగోళ శాస్త్ర విభాగం అధ్యాపకులు బిఎన్ఎస్‌వి.ప్రసాద్, తెలుగు అధ్యాపకులు ఎస్.యా కోబు, గ్రంథాలయారిని జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మార్టేరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 140 మంది విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్ తెలిపారు. ఈ కార్య క్రమానికి మానవత పెనుమంట్ర శాఖ అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా మానవత ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, రోటరీ అధ్యక్షులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుడిమెట్ల రామారెడ్డి, రీడర్స్ ఫోరం మానవత కమిటీ సభ్యులు పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వీరవాసరం : స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర ప్రముఖమైందని గ్రంథ పాలకుడు బత్తుల హనుమంతరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి అర్పించారు. శెట్టిబలిజ పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యమ పితామహులు నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్.రంగనాథ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

పాలకోడేరు : గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖ నేతలకు గొల్లలకోడేరు గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు.

ఉండి : గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్నవారికి ఉండి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జెవి.కృష్ణమూర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధూమపానం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి సైకాల జిస్ట్ చిన్నవీర్రాజు, నల్లా సత్యకృష్ణకిరణ్‌ప్రసాద్ హాజరయ్యారు.

గణపవరం : మండలంలోని పిప్పర గ్రంథాలయంలో వారి చిత్రపటాలకు స్థానిక పెద్ద దండు సూర్యనారాయణరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిప్పర హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఆంజనేయులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఐవి.నరసింహరాజు, జివి.కృష్ణారావు, గ్రంథ పాలకులు పి.రంగారావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నరసాపురం పార్కు రోడ్డులోని గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి సోని, శాస్త్రవేత్త రంగినేది సుబ్బారావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

లక్ష్మమ్మ కుటుంబానికి సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన పెమ్మాడి లక్ష్మమ్మ(80) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ లక్ష్మమ్మతో పాటు వారి కుమారుడు సిపిఎం పట్ల ఎంతో ప్రేమాభిమానాలు చూపించేవారన్నారు. ఆయనతో పాటు నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, స్టాలిన్, రాజేష్, స్వామి, విజయ్‌కుమార్, పద్మరాజ్ పాల్గొన్నారు.

'అరాచక ప్రభుత్వాన్ని ఓట్లతో తరిమికొట్టాలి'

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రంలో వైసిపి అరాచక ప్రభుత్వాన్ని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓట్లతో తరిమి కొట్టాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. మండలంలోని పెదఅమిరంలో నిర్మలా ఫంక్షన్ హాలులో టిడిపి, జనసేన ఆత్మీయ సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తోట సీతారామలక్ష్మి హాజరై మాట్లాడారు.

ఆచంట : స్థానిక రామేశ్వరస్వామి సత్రంలో మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడారు. ఈ సమావేశంలో పిఎసి సభ్యులు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్, బోళ్ల సతీష్, జవ్వాది బాలాజీ శ్రీనివాస్, ఉప్పలపాటి సురేష్‌బాబు, దిగమర్తి సూర్యకుమారి, కేతా మీరయ్య, బీర నరసింహమూర్తి, బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక మరిశెట్టి ఫంక్షన్ హాలులో జనసేన, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఉమ్మడి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు వర్ధనపల్లి కాశీ, మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షుడు రాంపండు, మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

ఇసుక కొరతతో కార్మికుల అవస్థలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని పాలకొల్లు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ భవనంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక కొరతతో సెంట్రింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, పెయింటింగ్‌పై ఆధారపడిన వేలాది కార్మికులకు పని లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఇసుక కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు 'వండర్ కిడ్స్' సాయం

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక మెంటేవారితోటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఎనిమిది కుటుంబాలకు వండర్ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం వితరణ అందించింది. స్కూల్ కరస్పాండెంట్ అల్లు రామకృష్ణంరాజు బాధితులకు అండగా నిలబడి వారిలో మనోధైర్యాన్ని నింపారు. గ్యాస్ స్టవులు, బిందెలు, వంట సామగ్రి అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లు వనజాక్షికుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అల్లు వంశీకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ అల్లు భాగ్యశ్రీ, సిపిఎం జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, మాజీ కౌన్సిలర్ పంతం సతీష్, మనోజ్, తోట సురేష్ పాల్గొన్నారు.


వంట సామగ్రి అందిస్తున్న స్కూల్ యాజమాన్యం

చెస్ పోటీల్లో విష్ణు విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీల్లో ఒంగోలులోని రైజ్ కళాశాలలో జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల చెస్ (మహిళలు) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన శ్రీ విష్ణు కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నా రని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన డి.సౌజన్య, సాయివైష్ణవి, విమలాచిత్ర, కె.ఫ్లారిన్స్‌లను కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరాజు అభినందిం చారు. ఈ నలుగురిలో మొదటి ముగ్గురు విద్యార్థినులు సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యా లయాల చెస్ (మహిళలు) పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినులను ప్రోత్సహించిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీతను అభినందించారు.

విహారి కార్గో టికెట్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - తణుకు

ఎపిఎస్ ఆర్‌టిసి ఆథరైజ్డ్ బుకింగ్ కౌంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సప్ప గిరిధర్‌కుమార్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన విహారి కార్గో టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇది నాలుగో బుకింగ్ కౌంటర్ అని, గృహస్తులు, వ్యాపారుల సౌకర్యార్థం ఈ కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కౌంటర్ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సింధనూరు, బెంగళూరు, చెన్నై హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు కూడా కార్గో బుకింగ్ చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ పాల్గొన్నారు.

ఘనంగా నాయకర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయంలో మేముసైతం జనసేన టీమ్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు జనసైనికులు రక్తదానం చేశారు.

దండగర్రలో 'పల్లెపోరు'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని దండగర్ర గ్రామంలో గురువారం పల్లెపోరు కార్యక్రమం నిర్వహించరు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, స్థానిక నాయకులు, తెలంగాణ వీర మహిళ విభాగం వైస్ ఛైర్మన్ పిల్లా నాగరత్నం, గ్రామ సర్పంచి పిల్లా రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కర్రి వెంకటస్వామినాయుడు పాల్గొన్నారు.

ధాన్యం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెంటపాడు

ధాన్యం రైతులను ఆదుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కరక వెంకట్రావు, చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రంగారావు కోరారు. పెంటపాడు ప్రజాసంఘాల కార్యాల యంలో రైతు సంఘం ముఖ్యుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించడంతో రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం తేమ శాతం 20 వరకు సడలించాలని, ధాన్యం కొనుగోలు చేయాలని, కొన్న ధాన్యానికి వెంటనే రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో ఆచంట, పెనుమంట్ర, వీరవాసరం, నరసాపురం, ఉండి, మొగల్తూరు పలుచోట్ల సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దాళ్వా పంటలకు ఈ శివారు ప్రాంతాల్లో కూడా సాగునీరందించాలని కోరారు.

'టిడ్కో లబ్ధిదారులను మోసగించిన వైసిపి'

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాల పేరుతో మోసపోయిన పేదలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేందుకు టిడిపి తలపెట్టిన వంటావార్పు నిరసన కార్యక్రమాన్ని పోలీసుల సాయంతో వైసిపి నాయకులు భగ్నం చేయడం అరాచకమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన కార్యాలయంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి నాయకులతో కలిసి గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టిడ్కో గృహాలను సిఎం జగన్ బ్యాంకులో తాకట్టు పెట్టి లబ్ధిదారులను మోసం చేశారన్నారు. టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

'బహిరంగ చర్చకు సిద్ధమా'

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మీడియా ఫోకస్ కోసం చేసిన డ్రామాలు అంతా ఇంతా కాదని, ప్రజలు వాస్తవాలు, అవాస్తవాలు గమనిస్తున్నారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ అన్నారు. ఎఎంసిలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎ నిజంగా ప్రజలకు మంచి చేయాలని కోరు కుంటే తాము చేసే అభివృద్ధికి అడ్డుపడవద్దని, పాలకొల్లు అభివృద్ధికి సహకరించాలని అన్నారు. టిడ్కో గృహాల్లో చేసిన అవినీతి నిజనిజాలు నిరూపిస్తామన్నారు. టిడ్కో గృహాలను ఎవరు బ్యాంకులో తాకట్టు పెట్టారో ప్రజల సమక్షంలో తెలుసుకుందాం రండని సవాల్ విసిరారు.